క్లుప్తంగా

నిబంధనల ప్రకారమే కూలీ



కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ హరినందన్‌రావు

మునిపల్లి(అందోల్): ఉపాధి హామీ పథకంలో పని చేసిన కూలీలకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం డబ్బులు చెల్లింస్తోందని ఎంపీడీఓ హరినందన్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని మునిపల్లిలో కూలీలు చేసిన పనులను స్వయంగా పరిశీలించి మాట్లాడారు. జాబ్ కార్డు ఉన్న కూలీలందరూ పని చేయాలని సూచించారు.

సొంత నిధులతో బోర్లు ఏర్పాటు



ఉజ్వల్‌రెడ్డిని సన్మానిస్తున్న ప్రజలు

జహీరాబాద్ టౌన్: పట్టణ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు డాక్టర్ ఉజ్వల్‌రెడ్డి సొంత నిధులతో మూడు బోర్లు వేయించారు. పట్టణంలోని రాంనగర్, గాంధీనగర్ ప్రాంతంలో నీటి సమస్య తీవ్రంగా ఉంది. తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. విషయం ఉజ్వల్‌రెడ్డి దృష్టికి రావడంతో బోర్లు వేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు మంగళవారం ఆయన రాంనగర్‌లో రెండు, గాంధీనగర్‌లో ఒక బోరు వేయించారు. దీంతో ప్రజలు సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



పరామర్శిస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

కంగ్టి(నారాయణఖేడ్): అనారోగ్యంతో ఎన్కెమురి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నేత దేవిదాస్ కుమారుడు హైదరాబాద్ మదీనాగూడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకుని డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం ఆస్పత్రికి వెళ్లి దేవిదాస్, అతని కుటుంబ సభ్యులను పరామర్శించారు. దేవిదాస్ కుమారుడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ఆయన వెంట నాయకులు అంజప్ప, శరణప్ప, పవన్ ఉన్నారు.

అంగన్‌వాడీలో విద్యాబుద్ధులు



మునిపల్లి(అందోల్): అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు విద్యా బుద్ధులు నేర్పించనున్నట్లు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శ్రీలత పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని తక్కడపల్లి కేంద్రంలో పిల్లల తల్లులతో సమావేశం నిర్వహించారు. అంగన్‌వాడీలో పిల్లలు చేరిన ప్పటి నుంచి ఇప్పటి వరకు ఏం నేర్చుకున్నారో స్వయంగా తల్లుల ముందు చదివి వినిపించారు. అంతే కాకుండా వివిధ రకాలఆటలు ఆడారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాంచంద్రారెడ్డి, అంగన్‌వాడీ టీచర్ లక్ష్మి, మాణిక్యం, వీరేశం, పిల్లల తల్లులు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ ముఖ్యనేతలకు దిశానిర్దేశం



నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సదాశివపేట(సంగారెడ్డి): 27న జరగనున్న బీఆర్‌ఎస్ బహిరంగ సభకు నియోజకవర్గం నుంచి గులాబీ దండు వేలాదిగా తరలిరావాలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పిలుపునిచ్చారు. మంగళవారం ఓ ఫంక్షన్ హాల్‌లో పట్టణ బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్యనేతలతో సమావేశం నిర్వహించారు. కేసీఆర్ సభా సమయం సందర్భాన్ని నాయకులకు వివరించారు. వార్డు నుంచి కులసంఘాల నాయకులు పార్టీ నాయకులు, కార్యకర్తలు బహిరంగ సభకు ఒక రోజు ముందు ప్రతి వార్డులో జెండావిష్కరణ చేయాలని సూచించారు. కార్యక్రమంలో తాజా మాజీ కౌన్సిలర్లు, సర్పంచులు ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ముప్పు తప్పించండి మహాప్రభో!

- సంగారెడ్డిలో ప్రమాదకరంగా హోర్డింగ్‌లు, బ్యానర్లు
- భయాందోళనలో వాహనదారులు, ప్రయాణికులు
- అధికారుల తీరుపై ప్రజల్లో అసంతృప్తి

సంగారెడ్డి క్రైమ్: సంగారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని ఇష్టానుసారంగా భారీ హోర్డింగ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ఏ సమయంలో ఎలాంటి ప్రమాదం జరుగుతోందని స్థానిక ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. పట్టణంలో చాలాచోట్ల బహుళ అంతస్తుల నిర్మాణాలు, గ్రేటర్ కమ్యూనిటీ నిర్మాణాలతో పాటు విద్యాసంస్థల నిర్మాణాలు జోరుగా కొనసాగుతుండటంలో వాణిజ్య ప్రకటనలకు మంచి డిమాండ్ పెరిగింది. మున్సిపాలిటీ పరిధిలో ప్రస్తుతం 20 నుంచి 50 వరకు భారీ హోర్డింగ్‌లు ఉన్నాయి. దీంతో మున్సిపాలిటీ అధికారులు అధిక ఆదాయం పొందవచ్చని



కొత్త బస్టాండ్ ఆవరణలో ప్రమాదకరంగా భారీ హోర్డింగ్

పట్టణంలో ఎక్కడపడితే అక్కడ హోర్డింగ్‌లకు అనుమతి ఇచ్చారు. కానీ...మున్సిపాలిటీ పరిధిలో పలుచోట్ల రహదారి పక్కన ఏర్పాటు చేసిన హోర్డింగ్‌లు గాలికి కూలిపోయే ప్రమాదం ఉండటంతో వాహనదారులు, ప్రయాణికులు రోడ్లపైకి రావాలంటే జంకుతున్న పరిస్థితి నెలకొంది.

చాలాచోట్ల భారీ హోర్డింగ్‌లు

అధికారులు అనుమతులు ఇవ్వడంతోనే అధిక సంఖ్యలో హోర్డింగ్‌లు ఏర్పాటు చేశారని అధికారుల తీరుపై స్థానికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ హోర్డింగ్‌కు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఇకనైనా హోర్డింగ్‌ల వలన ప్రమాదం జరగకముందే పట్టణ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి హోర్డింగ్‌లు తొలగించేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

అనుమతుల్లేని వాటిని తొలగించాలి

సంగారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో గతంలో అనుమతులు తీసుకొని హోర్డింగ్‌లను తొలగించాలని మున్సిపల్ అధికారులు హోర్డింగ్ యాజమానులకు నోటీసులు జారీ చేశామని చెప్పారు. గతంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు అనుమతి తీసుకుని ఏర్పాటు చేసిన భారీ హోర్డింగ్‌లకు రెన్యూవల్ చేసుకోవాల్సి ఉంటుంది.

ప్రమాదకర హోర్డింగ్స్‌ను తొలగించాలి



సంగారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో బహుళ అంతస్తుల యాజమానులు ఇష్టానుసారంగా భారీ హోర్డింగ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. హోర్డింగ్‌ల కారణంగా తరచూ ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. పట్టణంలో పాత బస్టాండ్ నుంచి పోతిరెడ్డిపల్లి చౌరస్తా వరకు రేడియల్ రోడ్డు మధ్యలోని డివైడర్లపై కూడా తమ ఇష్టానుసారంగా హోర్డింగ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో వాహనదారులు, ప్రయాణికులు వాటిని చూస్తూ తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి ప్రమాదకర హోర్డింగ్స్‌ను తొలగించేలా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలి.

–హనుమంతు, వాహనదారుడు

నోటీసులు జారీ చేస్తున్నాం



గతంలో వివిధ వాణిజ్య సంస్థల తమ ప్రకటన నిమిత్తం అనుమతులు తీసుకున్న హోర్డింగ్‌లకు ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇప్పుడు వాటిని రెన్యూవల్ చేయడం లేదు. దీంతో మున్సిపాలిటీ పరిధిలో హోర్డింగ్‌లను తొలగించాలని ఆయా యాజమానులకు నోటీసులు జారీ చేస్తున్నాం. అయితే పట్టణంలోని రేడియల్ రోడ్డుపై హోర్డింగ్‌లకు ఆర్ అండ్ బీ శాఖ అధికారులు అనుమతులిచ్చారు.

–ప్రసాద్ చౌహాన్ , సంగారెడ్డి మున్సిపాలిటీ కమిషనర్

పేదలకు అండగా సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు పేదలకు వరంగా మారాయని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం నియోజకవర్గం పరిధిలోని 272 మంది లబ్ధిదారులకు మంజూరైన 2 కోట్ల 72 లక్షల రూపాయల విలువైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేస్తున్నామన్నారు. దళారుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సింధురెడ్డి,



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

పుష్ప, జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, మాజీ జెడ్పీటీసీలు సుధాకర్ రెడ్డి, కుమార్ గౌడ్, బాల్ రెడ్డి, మాజీ ఎంపీపీ దేవానంద్, వెంకట్ రెడ్డి, షేక్ హుస్సేన్, ఆయా మండలాల తహసీల్దార్లు, నాయకులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి జైలు

సంగారెడ్డి క్రైమ్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జైలుశిక్ష, జరిమానా విధించిన సంఘటన సంగారెడ్డి పట్టణ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ సుమన్‌కుమార్ కథనం ప్రకారం.. సోమవారం అర్ధరాత్రి పోతిరెడ్డిపల్లి, పాత బస్టాంట్, బైపాస్‌లోని గుర్రపు బొమ్మ వద్ద నిర్వహించిన తనిఖీల్లో 10 మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని మంగళవారం కోర్టులో హాజరుపరచగా జిల్లా అదనపు న్యాయమూర్తి షకీల్ అహ్మద్ సిద్దిఖీ ఒకరికి రెండు రోజుల జైలుశిక్ష, నలుగురికి రూ. 2000, చొప్పున, మిగతా నలుగురికి రూ. 1500, మరోకరికి రూ. 1000 చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. సోమవారం నిర్వహించిన తనిఖీల్లో 25 మంది అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని మంగళవారం కోర్టులో హాజరుపరచగా 15 మందికి రూ.1500 జరిమానా, 10 మందికి రూ.2 వేలు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

వరంగల్ సభను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఆదర్శ్‌రెడ్డి

బీఆర్‌ఎస్ నాయకుడు ఆదర్శ్‌రెడ్డి

పటాన్‌చెరు టౌన్: వరంగల్ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ పటాన్‌చెరు నియోజకవర్గ కో–ఆర్డినేటర్ ఆదర్శ్‌రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రజావ్యతిరేక పాలనను నిరసిస్తూ బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ నివాసం వద్ద వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, మాజీ జెడ్పీటీసీ శ్రీకాంత్‌గౌడ్, బాల్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ అంజయ్య యాదవ్, డివిజన్ అధ్యక్షుడు నాగరాజు యాదవ్, శ్రీధర్ చారి, మిరాజ్ ఖాన్ పాల్గొన్నారు.

శాఖాహారంతో ఆరోగ్యం



పోషకాహారం అందిస్తున్న సీడీపీఓ సుజాత, తదితరులు

కల్హేర్(నారాయణఖేడ్): గర్భిణీలు, తల్లులు తప్పనిసరిగా పోషకాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ సుజాత సూచించారు. మంగళవారం సిర్గాపూర్‌లో పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ నాగరం శ్రీనివాస్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత రాథోడ్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

జహీరాబాద్: జహీరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మాణిక్‌రావు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. పట్టణంలోని వివిధ వార్డులకు చెందిన 13 మందికి రూ.3.30లక్షల విలువ గల చెక్కులు అందజేశారు. అలాగే, కోహీర్ మండలం చింతలగట్టుకు చెందిన బేబీ నిఖితకు రూ.49,500, జానీమియాకు రూ.51వేలు, మొగుడంపల్లి మండలం జాడీమల్కాపూర్ గ్రామానికి చెందిన సంజీవ్‌కు రూ.14, 500 విలువ గల చెక్కులను పంపిణీ చేశారు.

మునిపల్లిలో..

మునిపల్లి(అందోల్): ఆయా గ్రామాల లబ్ధిదారులకు షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రాంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

అధ్యక్షుడు సతీష్ కుమార్ పంపిణీ చేశారు. మంగళవారం తహసీల్దార్ గంగాభవాని ఆధ్వర్యంలో లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు.

సంక్షిప్త వార్తలు

◆ చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

మునిపల్లి(అందోల్): ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే వారి దాహార్తిని తీర్చేందుకు మునిపల్లి కి చెందిన కడగోని నరేష్ చలివేంద్రం ఏర్పాటు చేయడం సంతోషమని ఎంపీడీఓ హరినందన్‌రావు అభినందించారు. మంగళవారం మండల కేంద్రం ప్రభుత్వ కార్యాలయాల సమీపంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని హరినంధ్‌రావు ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ రమేశ్‌గౌడ్, వీరశైవలింగాయత్ సమాజం జిల్లా కార్యదర్శి పరమేశ్వర్ పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

◆ రెండు టిప్పర్లు, జేసీబీ సీజ్

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): అనుమతులు లేకుండా అక్రమంగా మొరం తరలిస్తున్న రెండు టిప్పర్లు, ఒక జేసీబీని సీజ్ చేసినట్లు మంగళవారం సీఐ మహేష్‌గౌడ్ పేర్కొన్నారు. సీఐ వివరాల ప్రకారం.. మంగళవారం తెల్లవారు జామున మండలంలోని రేజింతల్ శివారులో అనుమతులు లేకుండా పట్టణంలోని వెంచర్లకు అక్రమంగా మొరం తరలిస్తున్నట్లు సమాచారం అందింది. దీంతో తమ సిబ్బంది వెళ్లి వారిని అదుపులోకి తీసుకొని రెండు టిప్పర్లు, ఒక జేసీబీని సీజ్ చేసినట్లు తెలిపారు.

◆ సమస్యల పరిష్కారానికి కృషి

సంగారెడ్డి: నాయీ బ్రాహ్మణులు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆ సంఘం సంగారెడ్డి అధ్యక్షుడు మాణిక్ ప్రభు, ప్రధాన కార్యదర్శి శ్రీశైలం పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని జెడ్పీహాల్‌లో సంగారెడ్డి నాయీబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. హక్కుల కోసం సంఘం సభ్యులు కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే చింతాప్రభాకర్ కలిసి వినతిపత్రం అందజేశారు.

◆ నిధుల మంజూరుపై హర్షం

కంది(సంగారెడ్డి): గ్రామాల్లో సీసీ రోడ్ల ఏర్పాటుతో ప్రజల ఇబ్బందులు తీరనున్నాయి. పంచాయతీలోని అంతర్గతదారులను నిర్మించేందుకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా నిధులు మంజూరయ్యాయి. కంది మండ లంలో 22 గ్రామ పంచాయతీలు ఉండగా, వీటిలో 18 గ్రామ పంచాయతీల్లో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టడానికి రూ.3.16 కోట్లు మంజూరు చేసింది. పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్లు నిర్మాణం పనులు ప్రారంభించారు.

◆ నూతన నియామకం

హత్నూర(సంగారెడ్డి): బీఆర్‌ఎస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడిగా హత్నూర మండలం కొన్యాల గ్రామానికి చెందిన మాజీ డీసీఎంఎస్ ఉపాధ్యక్షుడు రాంచంద్రారెడ్డిని నియమిస్తున్నట్లు ఎమ్మెల్యే సునీతారెడ్డి ప్రకటించారు. మంగళవారం మంగాపూర్ గ్రామంలో మాజీ అసంఘటిత కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ దేవేందర్ రెడ్డి నివాసంలో ముఖ్య కార్యకర్తల సమావేశం ఎమ్మెల్యే సునీతా రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆవిర్భావ సభకు కార్యకర్తలు తరలించేందుకు కృషి చేయాలన్నారు.

◆ బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడిగా నాగరాజు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడిగా నాగరాజ్ యాదవ్‌ను నియమించారు. మంగళవారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ముత్తంగి పీఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో మాజీ జెడ్పీటీసీ శ్రీకాంత్ గౌడ్, కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన పట్టణ, మండల స్థాయి ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో న్యాయవాది నాగరాజు యాదవ్‌ను డివిజన్ అధ్యక్షుడిగా నియమిస్తూ నియోజకవర్గం బీఆర్‌ఎస్ కోఆర్డినేటర్ ఆదర్శ్‌రెడ్డి నియామక పత్రాన్ని అందజేశారు.

◆ క్షతగాత్రులకు పరామర్శ

కంగ్టి(నారాయణఖేడ్): సిర్గాపూర్ మండలం వాసర్‌లో సోమవారం నరేంద్రచార్య మహరాజ్ పాదుకా దర్శనం కార్యక్రమంలో సుడిగాలి బీభత్సానికి టెంట్లు కూలి గాయాలైన వారిని నగేష్ షెట్కార్ మంగళవారం పరామర్శించారు. నారాయణఖేడ్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారి వద్దకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. అనంతరం వైద్యులతో మెరుగైన చికిత్స అందించాలని కోరారు. వారితో పాటు శివాజీ పటేల్, కంగ్టి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజు, విష్ణువర్ధన్‌రెడ్డి, వాసర్ పాల్గొన్నారు.

రైతులు నష్టపోకుండా కొనుగోళ్లు చేయాలి

ఎమ్మెల్యే సునీతారెడ్డి

హత్నూర (సంగారెడ్డి): రైతులు నష్టపోకుండా ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి.. మిల్లర్లకు సరఫరా చేయాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం హత్నూరలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఆమె అధికారులతో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులు దళారుల బారిన పడకుండా ప్రభుత్వ కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించాలని కోరారు. రైతులు ఇబ్బంది పడకుండా గన్నీ బ్యాగులు, సుతిల్ తాడు అందుబాటులో ఉంచాలన్నారు. టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. కార్యక్రమంలో అసంఘటిత కార్మిక సంక్షేమ బోర్డు మాజీ రాష్ట్ర చైర్మన్ దేవేందర్ రెడ్డి, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ స్వప్న, తహసీల్దార్ పర్వీన్ షేక్, ఎంపీడీఓ శంకర్, ఏపీఎం దేవేందర్, పీఏసీఎస్ చైర్మన్లు పాల్గొన్నారు.

పెద్దాపూర్‌లో..

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండలంలోని పెద్దాపూర్ రైతువేదికలో మంగళవారం ధాన్యం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సునీతారెడ్డి

కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రభాకర్, టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతు పండించిన ధాన్యాన్ని మద్దతు ధరకు ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నారు. టార్పాలిన్లు, గోనె సంచులు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. అలాగే, నిర్మలారెడ్డి మాట్లాడుతూ.. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ రాంరెడ్డి, ఆత్మకమిటీ చైర్మన్ ప్రభు, మార్కెట్ కమిటీ చైర్మన్ కుమార్, వైస్ చైర్మన్ కృష్ణ, పీఏసీఎస్ చైర్మన్లు రత్నాకర్ రెడ్డి పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

నారాయణఖేడ్: అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకొని అగ్నిమాపక అధికారులు, సిబ్బందికి ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. అధికారి శ్రీధర్, ఎల్‌ఎఫ్ విఠల్, డీఓపీ విజయ్‌కుమార్, సిబ్బంది అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు కారణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, జరిగితే నివారణ చర్యలను వివరించారు. వంటగ్యాస్ లీకై సిలిండర్‌కు మంటలు అంటుకుంటే మంటలు ఆర్పే విధానాన్ని ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. డీఎం మల్లేశయ్య, ఇంజనీర్ దశరథ రావు, హెడ్‌కానిస్టేబుల్ సత్యనారాయణ పాల్గొన్నారు.

◆ జోగిపేట అగ్నిమాపక ఆధ్వర్యంలో..

జోగిపేట(అందోల్): అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం జోగిపేట అగ్నిమాపక కేంద్రం ఆధ్వర్యంలో జోగిపేట బస్టాండ్ ఆవరణలో అగ్ని ప్రమాద నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్‌గౌడ్ అగ్ని ప్రమాదం వంటి విపత్కర పరిస్థితుల్లో ఎలా స్పందించాలి, ఎలా రక్షించుకోవాలనే విషయాలపై అవగాహన కల్పించారు.

◆ జాగ్రత్తలు పాటించాలి

సదాశివపేట(సంగారెడ్డి): అగ్ని ప్రమాదాలు ఎక్కువడి వేసవి కాలంలోనే జరుగుతుంటాయని అగ్నిమాపక అధికారి భిక్షపతి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలో బస్టాండ్, జ్యోతి థియేటర్, మహేశ్వరి థియేటర్, కాసం షాపింగ్ మాల్‌నందు అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. జాగ్రత్తలు, నివారణ చర్యలు తెలియజేశారు.

◆ జహీరాబాద్ బస్టాండ్‌లో..

జహీరాబాద్ టౌన్: అగ్నిమాపక శాఖ వారోత్సవాల సందర్భంగా మంగళవారం అధికారులు పట్టణంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాల్లో ఫైర్ సిబ్బంది అగ్ని ప్రమాదాల నివారణ తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతినగర్ డివిజన్ పరిధిలో నిర్వహించిన గురు శిష్య హస్తశిల్ప్ ప్రశిక్షణ్ ప్రోగ్రామ్‌ను మంగళవారం తెలంగాణ హ్యాండీ క్రాఫ్ట్స్ డెవలప్‌మెంట్ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, ఎండి శైలజ రామయ్యర్ ప్రారంభించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ సింధు రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. ఇందులో 30మంది కళాకారులకు శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. శిక్షణ పొందిన కళాకారులకు రూ.2వేల విలువైన టూల్ కిట్లు అందజేస్తారని తెలిపారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సింధు

వైభవంగా వీరభద్రేశ్వర స్వామి జాతర



ఎమ్మెల్యే మాణిక్‌రావును సన్మానిస్తున్న సభ్యులు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని మెరియంపూర్ గ్రామ సమీపంలోని వీరభద్రేశ్వర ఆలయంలో ఉత్సవాలు కొనసాగుతున్నాయి. రెండవ రోజు మంగళవారం ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం, పల్లకీ ఉత్సవం, 10 గంటలకు బీచ్‌కుంద మఠాధిపతి 108 పూజ్య సోమలింగ శివాచార్య మహాస్వామి, పీఠాధిపతి డాక్టర్ రాజశేఖర్ శివాచార్యులచే ప్రవచనాలు చేయించారు. ఎమ్మెల్యే మాణిక్‌రావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఎమ్మెల్యే వెంట బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్‌తో పాటు నర్సింహారెడ్డి, రాజు పాటిల్, రవి, మల్‌రెడ్డి, అశోక్, సంగమేశ్వర్, కాశీనాథ్ తదితరులు ఉన్నారు.

వన నర్సరీల పరిశీలన

కంది(సంగారెడ్డి): నర్సరీల్లో పెంచుతున్న మొక్కలు ఎండిపోకుండా నీరు అందించాలని ఎంపీఓ మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని చిద్రప్ప, ఆరుట్లలో వననర్సరీలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలంలో నాటేందుకు మొక్కలను సిద్ధంగా ఉంచాలన్నారు. గ్రామానికి 6వేల చొప్పున మొక్కలు నాటేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని తెలిపారు. అనంతరం ఉపాధి హామీ కూలీల హాజరును పరిశీలించి, ఎండతీవ్రంగా ఉన్నందునా ఉదయం సమయంలోనే పనులు జరిగేలా చూడాలని ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ కూలీలు పాల్గొన్నారు.



హాజరు పరిశీలిస్తున్న ఎంపీఓ మహేందర్ రెడ్డి

రామయ్యను ఆదర్శంగా తీసుకోవాలి




మొక్కలు నాటుతున్న విద్యార్థులు, హెచ్‌ఎం

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ప్రకృతి ప్రేమికుడు వనజీవి రామయ్య జ్ఞాపకార్థం మండలంలోని నిజాంపూర్(కె) ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం హెచ్‌ఎం రామకృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థులు పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి, ఆ మొక్కలకు వనజీవి రామయ్య పేరు పెట్టారు. అంతకుముందు ఆయన చిత్రపటానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రామకృష్ణ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. తెలంగాణకు చెందిన వనజీవి రామయ్య తన జీవితంలో కోటి మొక్కలు నాటి చరిత్ర సృష్టించారని, పచ్చదనం ప్రాధాన్యతను తెలియజేశారన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు మొక్కలు నాటి పెంచాలని సూచించారు. కార్యక్రమంలో అమ్మఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ మీనా, హెచ్‌ఎం రామకృష్ణ ,ఉపాధ్యాయులు నవనీత, సునీత, తల్లిదండ్రులు రమేష్, నాగరాజు, మల్లేశం, దుర్గేష్, సుగుణమ్మ విద్యార్థులు పాల్గొన్నారు.

అడవిలో చెలరేగిన మంటలు

ఝరాసంగం(జహీరాబాద్): మండలంలోని బర్దిపూర్ గ్రామశివారులోని అటవీ ప్రాంతంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గ్రామానికి చెందిన పాండు గమనించి ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది గ్రామస్తుల సహాయంతో మంటలను అదుపు



చేశారు. ఈ ఘటనలో నీలగిరి చెట్లు దగ్ధమయాయని గ్రామస్తులు తెలిపారు.